ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
3 జిల్లా వార్తలు
శనివారం 8 మార్చి 2025
ఉష్ణోగ్రత : గరిష్ఠం 37.5 కనిష్ఠం 8.8

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:30 (శనివారం సాయంత్రం)
సహార్: 5:07 (ఆదివారం ఉదయం)

మహిళా వందనం

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

'ఆమె' అన్న రెండు అక్షరాలు సృష్టికి స్థితిలయలయ్యాయి.. అవకాశాలు రావాలేకానీ భూమ్మీదే కాదు.. ఆకాశం, సముద్రంలో కూడా సత్తా చాటేందుకు, దేశ రక్షణలో పాలుపంచుకునేందుకు సిద్ధమంటున్నారు. నింగి, నేల అనే తేడా లేకుండా జగమంతా తాము సాధించలేనిది ఏమీ లేదంటూ మహిళ తన శక్తిని సగర్వంగా నిరూపించుకుంటుంది. దేశం సాధించిన విజయాల్లో మహిళల పాత్ర గణనీయంగా ఉందని చెప్పొచ్చు. అంతటి అసాధారణ విజయాలు సొంతం చేసుకున్న మహిళలు.. సమాజంలో పొందాల్సినంత స్థాయిలో గౌరవం దక్కుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. నేడు మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు..

'ఆకాశమే హద్దుగా అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకెళ్తున్న మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు'



సృష్టికి ప్రతిసృష్టినిచ్చి..
సమాజానికి మార్గనిర్దేశనం చేసే
ఓ మహిళా నీకు వందనం..
సంసార సాగరంలో నీకు నీవే సాటిగా
ఓర్పు, నేర్పు, ఓదార్పునకు
అమ్మగా.. ఆలిగా.. అక్కగా.. చెల్లిగా
ఆత్మీయతతో అనురాగాన్ని పంచే
అమృతమూర్తీ నీకు వందనం..
మారుతున్న మర మనుషుల కాలంలో
మానవత్వం మంటగలుస్తున్న రోజుల్లో
దినదిన గండాల దాష్టీకాల నడుమ..
మారాలి నీ నడక.. ఎప్పుడూ తడబడక..
కావాలి నీవు మరో రుద్రమదేవి..
అసురుల పాలిట.. అపర కాళికవి..

శభాష్.. శ్వేత!

ఆటో నడుపుతూ ఆదర్శం

- చిన్న వయసులోనే కుటుంబ బాధ్యతలు
- క్యాన్సర్ మహమ్మారితో తండ్రి మృతి
- తండ్రి ఆటోనే ఉపాధిగా ఎంపిక
- యువతకు స్ఫూర్తిగా నిలుస్తోన్న శ్వేత

వారిది కడు పేద కుటుంబం.. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. నిత్యం పని చేస్తేగానీ.. పూట గడువని దుస్థితి. ఆస్తిపాస్తులు లేవు. అప్పు చేసి కొనుక్కున్న 'ఆటో'యే జీవనాధారం. ఆటో నడిపించడం ద్వారా వచ్చే డబ్బుతోనే భార్య, నలుగురి ఆడపిల్లలను పోషిస్తూ వచ్చాడు. విధి వక్రీకరించింది. క్యాన్సర్ మహమ్మారి కుటుంబ పెద్దను మింగేసింది. పెద్ద దిక్కు లేకపోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. తండ్రి లేని లోటును తీర్చేందుకు ఆయన చిన్న కూతురు తన తండ్రి నడిపిన అదే ఆటోను ఉపాధిగా ఎంచుకుంది. పట్టుదల.. ఆత్మవిశ్వాసం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చని నిరూపిస్తోంది ఆ యువతి. యువ మహిళలకు స్ఫూర్తిగా నిలుస్తున్న 'శ్వేత'పై ప్రత్యేక కథనం.

> నేను ఆటో నడిపిస్తుంటే మొదట్లో చూసినవారంతా రకరకాలుగా అనుకునే వారు. ఎవరు ఏమనుకున్నా నాకేందుకు. నా కుటుంబమే నాకు ముఖ్యమని భావించా. మా నాన్న నడిపిన ఆటోనే జీవనాధారంగా మార్చుకున్న.



పరిగి, మార్చి7(ఆంధ్రజ్యోతి): పరిగి మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డులోని సుల్తాన్‌నగర్‌కు చెందిన ఉడిత్యాల చంద్రయ్య, వెంకటమ్మలది నిరుపేద కుటుంబం. ఈ దంపతులకు నలుగురు ఆడ సంతానం. వారు సంధ్య, స్వప్న, సంగీత, శ్వేత. చంద్రయ్య అప్పు చేసి కొనుక్కున్న ఆటో నడపగా వచ్చే ఆదాయంతోనే భార్య, నలుగురు పిల్లలను పోషించేవాడు. రెండేళ్ల క్రితం చంద్రయ్య క్యాన్సర్ బారిన పడి చికిత్స చేయించుకోలేని పరిస్థితిలో మృతి చెందాడు. ఆయన మృతితో రోడ్డున పడిన కుటుంబాన్ని చిన్న కూతురు 18ఏళ్ల శ్వేత కుటుంబ నిర్వహణ బాధ్యతలను భుజాన వేసుకుంది. చిన్న కూతురు కావడంతో తండ్రి చంద్రయ్య తనతో పాటు ఆటోలో తిప్పడం పరిపాటిగా ఉండేది. ఆయా సందర్భంలో తన తండ్రి ఆటో నడుపుతున్న తీరును

మిగతా 5వ పేజీలో...

మరిన్ని కథనాలు 5లో..

ఆధునిక సేద్యంపై అవగాహన అవసరం

» రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

యాచారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సేద్యంపై రైతులకు అవగాహన కల్పించాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సూచించారు. కమిషన్ ఆధ్వర్యంలో ఉద్యాన పంటల సాగు కోసం మండలంలోని చౌదర్‌పల్లి, గడ్డమల్లాయగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టులుగా ఎంచుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయా గ్రామాలలో పాలకవర్గం సభ్యులు, ఉద్యాన, వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి కోదండరెడ్డి పర్యటించారు. అక్కడ కూరగాయల సాగును పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన మాట్లాడారు. రైతులు సంఘటితంగా తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ధాన్యం, కూరగాయలను మార్కెట్‌కు తరలించడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారని, రవాణా వసతి కల్పించడానికి త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడుతామన్నారు. రసాయన ఎరువులకు బదులుగా సేంద్రియ సాగుతో కూరగాయలు, ఆకు కూరలు సాగు చేయడంపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో ఎక్కువ రోజులు పంట నిల్వ ఉంటుందని చెప్పారు. మాదన్నపేట మార్కెట్‌లో రంగారెడ్డి జిల్లా రైతుల పట్ల అధికారుల ప్రవర్తించే తీరు దారుణంగా ఉందని తన దృష్టికి వచ్చిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం మార్కెట్‌యార్డును ఆధునికీకరించి అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. నందివనపర్తిలో మార్కెట్ గోదాంతో పాటు రైతులకు షెడ్లు నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వన్యప్రాణుల కారణంగా పంటలకు రక్షణ లేకుండాపోయిందని రైతులు జి.సురేందర్‌రెడ్డి, నర్సింహా అధికారులకు వివరించారు. లోఓల్టేజీతో పంటలు ఎండిపోతున్నాయని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంలో ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు వివరించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాములునాయక్, సునీల్‌కుమార్, గోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకన్నయాదవ్, భవాని, కార్యదర్శి సంధ్యారాణి, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సురేష్, జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు, ఉద్యాన శాఖ అదనపు డైరెక్టర్ బాబు, వ్యవసాయశాఖ డివిజనల్ అధికారి సుజాత, నాబార్డు ఏజీఎం హరీష్, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ పాల్గొన్నారు.

కూలీల అనాసక్తి!

- ముందుకు సాగని 'ఉపాధి' పనులు
- 15 శాతానికి దాటని కూలీల హాజరు
- కూలి చెల్లింపులో ఆలస్యమే కారణం


యాచారం మండలం చిన్నతూండ్లలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

యాచారం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఎండాకాలంలో ఉపాధి హామీ పనులకు వెళ్లేందుకు కూలీలు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాలో దాదాపు లక్షన్నర మందికి జాబ్‌కార్డులు జారీ చేయగా.. ఇందులో 96,867 మంది కార్డులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నాయి. అయితే ఇందులో కూడా చాలా మంది పనులకు రావడం లేదు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా కేవలం 12,453 (13శాతం) మంది మాత్రమే ఉపాధి పనులకు హాజరయ్యారు. గురువారం పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గురువారం 11796 మంది కూలీలు మాత్రమే పనులు చేశారు. సాధారణంగా ఈ సమయంలో జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పనులు ముమ్మరంగా జరుగుతాయి. కానీ ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదు. 15శాతం మంది కూడా ఉపాధి పనులకు హాజరుకాకపోవడంతో ఈ ఏడాది లక్ష్యాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇటీవల కాలంలో అనేక గ్రామాలను పట్టణాలుగా వర్గీకరించడం వల్ల ఆ ప్రాంతాలను ఉపాధి పథకం నుంచి మినహాయించారు. దీంతోపాటు ఏడాదిలో ఒక్కరోజు కూడా పనిచేయని వారి జాబ్‌కార్డులనూ రద్దు చేశారు. దీంతో జాబ్‌కార్డులున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. ఉమ్మడి జిల్లాలో ఇలా గడిచిన 2022 నుంచి ఇప్పటి వరకు 74,775 జాబ్‌కార్డులు రద్దుచేశారు. తద్వారా ఉమ్మడి జిల్లాలో 2,36,815 మంది కూలీలను తొలగించారు. ఇపుడు అన్ని అర్హతలతో కూలీలుగా ఉన్నవారు కూడా ఉపాధి పనులకు వచ్చేందుకు ఆసక్తిచూపడం లేదు. ప్రతీ గ్రామంలో రోజుకు 2వేల మంది కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో

మిగతా 6వ పేజీలో...

ఉపాధి పనుల కల్పనకు చర్యలు



కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పనులు చూపడంలో జిల్లాలోనే యాచారం మండలాన్ని అగ్రభాగాన నిలపడానికి కృషి చేస్తున్నాం. ప్రతీరోజు గ్రామాల్లో తిరిగి కూలీలను మోటివేట్ చేస్తున్న. మండలంలో ప్రతీ రోజు కనీసం 2వేల మందికి మించి పని కల్పించడానికి కృషి చేస్తున్నాం. తరచూ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లతో మాట్లాడుతున్న.

జి.నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో, యాచారం

ఘనంగా లంకా దహనం

కడ్తాల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చరికొండ వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకుడు చక్రవర్తి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో శుక్రవారం లంకా దహనం, పూర్ణాహుతి, చక్రతీర్థం, ధ్వజారోహణం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాలకుర్ల అద్దాల రాములు, మాజీ సర్పంచ్‌లు నర్సింహగౌడ్, లక్ష్మయ్య, భారతమ్మ, లోక్యనాయక్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మమ్మ, అర్చకులు వేణుచార్యులు, రామాచార్యులు, కృష్ణమాచార్యులు, తిరుమల కిరణ్ చార్యులు, నాయకులు భీష్మాచారి, జంగయ్యగౌడ్, లింగం, బల్వంత్‌రెడ్డి, వేణుగోపాల్, మహేందర్ పాల్గొన్నారు.


లంకా దహనం

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

» జిల్లా ఉపవైద్యాధికారి నాగేంద్రబాబు

శంకర్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): గర్భస్థ శిశు లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా ఉపవైద్యాధికారి నాగేంద్రబాబు హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం శంకర్‌పల్లిలోని గాయత్రి, లలిత, బీఎస్‌ఆర్, శోభ, హారిక, మెఘా తదితర ఆసుపత్రులను ఆయన తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దని ఆసుపత్రి నిర్వాహకులకు సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. అయితే ఆసుత్రుల్లోని సౌకర్యాలు, వసతులపై ప్రభుత్వానికి నివేదిక అందిస్తానని వివరించారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఉన్నారు.


ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా ఉపవైద్యాధికారి నాగేంద్రబాబు


నియామక పత్రం అందుకుంటున్న అమృత

టీఎన్‌జీవో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా అమృత

షాద్‌నగర్‌రూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): టీఎన్‌జీవో జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా హెల్త్ సూపర్‌వైజర్ అమృత ఎన్నికైనట్లు షాద్‌నగర్ యూనియన్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, జెనరల్ సెక్రటరీ విజయ్‌ల సమక్షంలో జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో అమృతను ఎన్నుకున్నారు. గతంలో మహిళా ఉపాధ్యక్షురాలిగా పనిచేసిన అమరావతి ఇటీవల బదిలీపై నల్లగొండ జిల్లాకు వెళ్లడంతో ఆమె స్థానంలో అమృతను ఎనుకున్నారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న అమృత ఎన్నిక కావడం పట్ల టీఎన్‌జీవో నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

గంప ప్రవీణ్ కుటుంబీకులకు పరామర్శ

» ఫోన్ ద్వారా వేర్వేరుగా మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్


కేంద్రమంత్రి కిషన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడుతున్న గంప రాఘవులు

కేశంపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దుండగుల చేతిలో అమెరికాలో హత్యకు గురైన రంగారెడ్డి జిల్లా కేశంపేట వాసి గంప ప్రవీణ్ తల్లిదండ్రులు రాఘవులు, రమలను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం వేర్వేరుగా ఫోన్ ద్వారా పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మృతదేహం తీసుకురావడానికి తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. అలాగే ఘటన గురించి అడిగి తెలుసుకున్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖతో మాట్లాడి ప్రవీణ్ మృతదేహాన్ని త్వరగా తీసుకురావడానికి తమవంతు కృషి చేస్తామని వారు భరోసా ఇచ్చారు. ఇలాంటి సమయంలోనే కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని వారిని ఓదార్చారు. అయితే ఉత్తర అమెరికా తెలుగు సంఘం(తానా)సభ్యులు సహకారం అందిస్తున్నారని మృతుని తండ్రి తెలిపారు. ఆదివారం వరకు మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మండలాధ్యక్షురాలు రొల్ల రాధిక, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్, నాయకులు మధుసూదన్ గౌడ్, రొల్ల రఘురాములు గౌడ్, యుగంధర్, శేఖర్, ఐలయ్య, రమేష్, నర్సింలు, సామ శంకర్ రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్ రెడ్డి, పద్మకృష్ణయ్యలు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- కలెక్టరేట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం


అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

రంగారెడ్డి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కలెక్టర్ సి. నారాయణరెడ్డి అన్నారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాల్లో నేటికీ మహిళలను తక్కువగా చూడటం జరుగుతుందన్నారు. ఇప్పుడిప్పుడే మహిళలకు చదువుపరంగా, ఆర్థికపరమైన విషయాలలో సమానంగా అవకాశాలు లభిస్తున్నాయన్నారు. అబ్బాయిలను అమ్మాయిలను సమానంగా విలువలు తెలిసేలా పెంచాలన్నారు. మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మహిళలకు అందించే పథకాలు వారికి అందేలా కృషి చేయాలన్నారు. జిల్లాను ముందుకు తీసుకెళ్లడంలో మహిళా అధికారుల సహకారం ఎంతైన ఉందని తెలిపారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తమను తాము సమర్థించుకోవాలని, అణిచివేతను తట్టుకుని ముందుకు సాగాలన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలపై చైతన్యం పెంపొందించేందుకు జిల్లా స్థాయి క్యాంపులు నిర్వహించి మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకురావాలని తెలిపారు. డీఆర్వో సంగీత మాట్లాడుతూ సమానత్వం చిన్నతనం నుంచే బోధించాలని తెలిపారు. జిల్లా టీజీవో అధ్యక్షుడు డాక్టర్ కె. రామారావు మాట్లాడుతూ మహిళలు శక్తి మేరకు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారని, మహిళా అధికారులకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మహిళా శిశుసంక్షేమాధికారి సంధ్యారాణి, అధికారులు శాంతిశ్రీ, టీజీవో మహిళా విభాగం నేతలు రేవతి, అలివేలు, మహేశ్వరి, అనిత, సుజాత, సైదమ్మ, టీజీవో జిల్లా కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి, నాయకులు గంప శ్రీనివాస్, టీజీవో సెంట్రల్ అసోసియేషన్ సభ్యులు మహిళాధికారులు పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయం


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

ఆమనగల్లు, మార్చి7(ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. మండలంలోని చప్టా తండాలో రూ.5లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు బాలాజీ సింగ్, మాజీ ఎంపీపీ అనితవిజయ్, మాజీవైస్ ఎంపీపీ అనంతరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములుతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం మేడిగడ్డ-శంకర్ కొండ రోడ్డులో కత్వ వాగుపై ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద రూ.3.10 కోట్లతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా, వేగవంతంగా పూర్తిచేసి వర్షాకాలం నాటికి వినియోగంలోకి తేవాలని అధికారులకు ఆదేశించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య, నాయకులు విజయ్‌రాథోడ్, రాంజా, బాబా, భాస్కర్, మల్లేశ్, శంకర్, హరిలాల్, కిషన్, రాజ్ కుమార్, నరేశ్, ఫరీద్, మహేశ్ పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

కడ్తాల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): వేసవి నేపథ్యంలో విద్యుత్, లో-వోల్టేజీ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవసరమైన చోట అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కడ్తాల మండల కేంద్రంలోని బీసీ కాలనీలో శుక్రవారం శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. కాలనీలో లో-వోల్టేజీ, విద్యుత్ సమస్యల పరిష్కారానికి చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. బీసీ కాలనీలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకుపోగా వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. మండల కేంద్రంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ మండల అధ్యక్షుడు పిప్పళ్ల యాదయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, మండల అధ్యక్షుడు బోసు రవి, టౌన్ అధ్యక్షుడు బానుకిరణ్, నాయకులు శ్రీకాంత్,మహేశ్, తిరుమలేశ్, లక్ష్మణాచారి, బుద్దురామ్, కృష్ణ,యాదగిరి, రఘు, వెంకటేశ్, మల్లేశ్, నర్సింహ్మ, జంగయ్య, సత్తయ్య, విద్యుత్ అధికారులు కృష్ణ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

చలో దుబాయ్

- క్రికెట్ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు తరలివెళ్తున్న అభిమానులు
- వీకెండ్ కావడంతో ముందే అమ్ముడైన విమాన టిక్కెట్లు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): దుబాయిలో జరగనున్న క్రికెట్ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా తిలకించేందుకు క్రికెట్ అభిమానులు హైదరాబాద్ నగరం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఆదివారం దుబాయిలో క్రికెట్ చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌లో న్యూజిలాండ్ జట్టుతో భారత్ తలపడుతున్న విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు పలువురు సినీ, వ్యాపార ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు పెద్ద సంఖ్యలో దుబాయి వెళ్తున్నారు. వీకెండ్ కావడంతో ఎక్కువ మంది శుక్రవారమే టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. దీంతో దుబాయి, షార్జా, అబుదాబీకి వెళ్లే అన్ని విమానసర్వీసుల టిక్కెట్లు ముందుగానే అమ్ముడయ్యాయి. దుబాయి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంకు దుబాయి ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు 38 కిలో మీటర్ల దూరం, అలాగే షార్జా ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు 50 కిలో మీటర్ల దూరం, అబుదాబీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు 100కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో దుబాయి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు సమీపంలో ఉండే ఈ మూడు ఎయిర్‌పోర్టులకు శుక్రవారం నేరుగా వెళ్లే సర్వీసుల టిక్కెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. అలాగే మ్యాచ్ జరిగే రోజైన ఆదివారం కూడా ఆ టిక్కెట్లు ముందుగానే అమ్ముడయ్యాయి. శనివారం కొన్ని డైరెక్ట్ సర్వీసు టిక్కెట్లు అందుబాటులో ఉన్నా బుకింగ్ సమయంలో రేట్లు భారీగా హెచ్చుతగ్గులు చూపుతున్నాయి. గంట గంటకూ ధరలు పెరుగుతున్నాయి. శనివారం రాత్రి 7:40కి హైదరాబాద్ నుంచి వెళ్లే ఎయిర్ ఇండియా విమానం టిక్కెట్ ధర అత్యధికంగా రూ. 54వేలుగా ఉంది.

గంప ప్రవీణ్ హత్య కిరాతక చర్య : వీర్లపల్లి


రాఘువులును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన తెలంగాణ విద్యార్థి గంప ప్రవీణ్ హత్య అత్యంత కిరాతకమైన చర్య అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రవీణ్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. మృతుడి తండ్రి రాఘవులుతో మాట్లాడారు. ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న ప్రవీణ్ జీవితం ఇలా అర్ధాంతరంగా ముగిసిపోవడం బాధాకరమని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలలో ఇలాంటి కిరాతకాలు జరుగడం దారుణమన్నారు. సంఘటనపై న్యాయ విచారణ జరిపి ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం తరఫున ప్రవీణ్ కుటుంబానికి అండగా ఉంటామని, మృతదేహాన్ని భారత్‌కు రప్పించేందు కు ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు. పార్టీ మండలాధ్యక్షుడు వీరేశ్, మాజీ జడ్పీటీ సీ విశాలశ్రవణ్‌రెడ్డి, జగదీశ్వర్, పల్లె ఆనంద్ కుమార్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, నవీన్, రాములు, గంప శ్యామ్ తదితరులున్నారు.

బీజేపీలో చేరికలు


ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో చేరిన కొత్తపల్లి గ్రామస్తులు

శంకర్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి సాధిస్తున్నదని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం ఎంపీ నివాసంలో బీజేపీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నాయకత్వంలో దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీలిచ్చి వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో రోజురోజుకూ బీజేపీకి ఆదరణ పెరుగుతున్నదని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం, మాజీ ఎంపీపీ బీర్ల నర్సింహ. నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బయానంద్ తదితరులు ఉన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్

షాద్‌నగర్‌రూరల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): రెక్కీలు నిర్వహించి తాళం వేసిన ఇళ్లే టార్గెట్‌గా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రదీప్ సూర్యవంశీ(19), అమిత్ చౌహాన్(24)లు కూలి పనులు చేసుకుంటూ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్నారు. రాత్రి వేళల్లో కాలనీల్లో సంచరిస్తూ తాళం వేసిన ఇళ్లల్లో చొరబడి దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈక్రమంలో పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో నివాసముండే శానమోని నర్సింహులు ఈ నెల 20న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణా జిల్లా నందిగామ మండలంలోని అంతారలో సోదరుడి ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్లారు. 26న కాలనీలో నివాసముండే విష్ణుమూర్తి మెయిన్ డోర్ తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి నర్సింహులుకు ఫోన్‌చేసి చెప్పాడు. ఆయన వచ్చి చూడగా మెయిన్ డోర్ తాళం విరగ్గొట్టడమే కాకుండా లోపల బీరువా తాళం కూడా పగలగొట్టి ఉంది. అందులో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడు, తులం బంగారు గొలుసు, తులం చేతి ఉంగరాలు, కొంత నగదు అపహరించుకుపోయినట్లు బాధితుడు గుర్తించాడు. ఈమేరకు 26న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. సాంకేతికత ఆధారంగా ఈనెల 5న నిందితులను పట్టుకొని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి ఒక గ్రాము నల్లపూసల దండ, ఒక గ్రాము బంగారు ఉంగరం, ఒక గ్రాము బంగారు గొలుసు, చిల్లర డబ్బులు, వెండి మూత స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సమావేశంలో ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో కేసును ఛేదించినట్లు తెలిపారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎస్సై శివారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఉపాధి పనుల అవకతవకలపై నజర్

బషీరాబాద్‌లో రూ.2.55 లక్షల రికవరీకి ఆదేశాలు


బషీరాబాద్‌లో ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

బషీరాబాద్, మార్చి7 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో జరిగిన అవకతవకలపై రూ.2.55లక్షల రికవరీకి ఆదేశాలు జారీ చేసినట్లు డీఆర్‌డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. బషీరాబాద్‌లోని స్థానిక ఉపాధిహామీ కార్యాయలం ఆవరణలో శుక్రవారం 15విడత సామాజిక తనిఖీ తుది నివేదిక ప్రజావేదిక సభలో ఆయన మట్లాడారు. మండలంలో 2023- 2024 సంవత్సరానికి గాను రూ.4కోట్ల 68లక్షల 43వేల 903 మేర వ్యయంతో ఉపాధిహామీ పనులు నిర్వహించారు.ఈ పనులపై గ్రామాల వారీగా డీఆర్పీలు తనిఖీలు చేపట్టగా, ప్రజా వేదికలో చదివి వినిపించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో మస్టర్లలో తప్పులు, ఆన్‌లైన్ మ్యాన్‌వల్‌లో హాజరులో తేడాలు, మెటీరియల్ కొలతలు, లెక్కల్లో వ్యత్యాసాలపై రూ.2.55 లక్షలు రికవరీకి ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ ప్రజావేదిక కార్యక్రమంలో ఏపీడీ సరళ, షోషల్ ఆడిట్ విజిలెన్స్ అఫీసర్ భార్గవి, అంబుడ్స్‌మెన్ రాములు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏపీవో శారద, ఈసీ నర్సింహరెడ్డి, వివిధ గ్రామ పంచాయతీల కార్యదర్శులు, టెక్నికల్, ఫీల్డ్ ఆసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అమలుపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలనానరు. భగీరథ పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా చూడాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, పంచాయతీ అధికారి సురేష్ మోహన్, మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ పరిశీలన..

రాజేందర్‌నగర్‌లోని ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ నారాయణరెడ్డి సందర్శించారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన సీళ్లను పరిశీలించి, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు, ఇతర ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన తీరు, గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును పరిశీలించారు. ఆర్డీవో వెంకట్‌రెడ్డి, అధికారులు, నాయకులు ఉన్నారు.

శభాష్.. శ్వేత!

(3వ పేజీ తరువాయి)

గమనించేది. అప్పుడప్పుడు సరదాగా ఆటో నడుపుతూ ఉండేది. కాగా, ఆమెకు ఇప్పుడదే జీవనధారమైంది. శ్వేత నిత్యం పరిగిలోని బహార్‌పేట్ చౌరస్తా ఆటో అడ్డాలో కనిపిస్తుంది. బహార్‌పేట్ నుంచి నారాయణపూర్‌తోపాటు, పరిగి పరిసర గ్రామాలకు ఆటోను నడిస్తున్నది. ఇలా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యం ఆటోను నడిపిస్తూ సుమారు రూ.500ల వరకు సంపాదిస్తోంది. వచ్చే డబ్బులతో కుటుంబాన్ని పోషిస్తోంది.

ఎంపీహెచ్‌డబ్ల్యు ఫస్టియర్ పూర్తి..

పరిగి బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్న శ్వేత పారామెడికల్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యు కోర్సులో అడ్మిషన్ తీసుకుంది. మొదటి సంవత్సరం పూర్తయిన సమయంలోనే తండ్రి మృతి చెందడంతో శ్వేత కుటుంబ పోషణకు తండ్రి వృత్తినే ఎంచుకుంది. ఆటోనే నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. శ్వేతకు ముగురూ అక్కలే. పెద్ద అక్క సంధ్య పెళ్లి కాగా, స్వప్న, సంగీత ఇంటి వద్దే ఉంటారు. పని దొరికితే ఏదైనా కూలీకి వెళ్తుంటారు.



మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

నాన్న క్యాన్సర్‌తో మృతి చెందడంతో మాకు పెద్దదిక్కు లేకుండా పోయింది. నాన్న తెచ్చిన ఆటోనే మాకు నాలుగు మెతుకులు పెడుతుంది. మాకు ఏ ఆస్తీ లేదు. ఆటో ద్వారా వచ్చిన కొద్దిపాటి డబ్బుతోనే మా నాన్న చిన్న ఇల్లు కట్టారు. నిత్యం ఆటో ద్వారా రూ.400 నుంచి రూ.500ల వరకు సంపాదిస్తున్నా. ఆ డబ్బుతోనే కుటుంబాన్ని పోషిస్తున్నా. అమ్మ కూడా దొరికినపుడు కూలీ పనికి వెళ్తది. మా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

-శ్వేత, ఆటో డ్రైవర్



సీఈవోగా రాణిస్తున్న తిరుపల్లి సంగీత



ఇబ్రహీంపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఈమె పేరు తిరుపల్లి సంగీత. ఇబ్రహీంపట్నం కేంద్రంగా నడుస్తున్న ఓం ప్రగతి మ్యాక్స్ ఫెడరేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో)గా రాణిస్తున్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు 25 వేల మంది సభ్యులుగా ఉన్న ఫెడరేషన్‌ను 24 ఏళ్లుగా ముందుండి నడుపుతున్నారు. ఎనిమిది మండలాలు ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, కందుకూరు, మహేశ్వరం, హయత్‌నగర్, బాలాపూర్ మండలాల్లో మ్యాక్స్ వస్తరించి ఉంది. మొత్తం 68 సంఘాలతో రూ.68 కోట్ల టర్నోవర్‌తో నడుస్తున్న మ్యాక్స్ 2023లో సహకార భారతి నుంచి జాతీయ స్థాయిలో పురస్కారం అందుకుంది. ఈ సంఘాల్లోని సభ్యులు అనేక మంది వ్యాపారాలు, రాజకీయాలో రాణిస్తున్నారు. ఈ మ్యాక్స్ ద్వారా 20 మంది ఉపాధి పొందుతున్నారు.

అన్నీ తానై..



కోట్‌పల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం గుండెపోటుతో భర్త మృతి చెందాడు. కుటుంబం బాధ్యతలు మొత్తం ఆమెపై పడ్డాయి. దుఃఖాన్ని దిగమింగుతూ ఇద్దరు పిల్లలను బాగా చదివిస్తూ మరో ఇద్దరికి ఉపాధి కల్పిస్తుంది. మండలంలోని ఎన్కెపల్లి గ్రామానికి చెందిన సావిత్రి(బుజ్జి). తనకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేస్తూ పూలు, పత్తి, పసుపు, పంటలు పండిస్తోంది. దీనికితోడుగా పొలం వద్ద బర్ల షెడ్డు వేసి రోజుకు 100 లీటర్ల పాలు అమ్ముతూ ఇద్దరికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తుంది. బర్ల షెడ్డు ద్వారా రోజుకు రూ.6,000 వస్తున్నాయని, ఇద్దరికి నెలనెలా జీతం ఇస్తూ ఇద్దరి పిల్లల్లో మొదటి కుమారుడిని బీటెక్ చదివిస్తున్నది. రెండో కుమారుడు ఇంటర్మీడియట్ చదువుతున్నాడు.

కుటుంబానికి 'వసంత'ం



దుద్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలో ఐదుగురు సంతానమైనా తల్లిదండ్రులు కుంగిపోలేదు. ముగ్గురు అబ్బాయిలు కాగా ఇద్దరు అమ్మాయిలు. కూలి పనులు చేస్తూనే అందరినీ చదివించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన దుద్యాల మండలం గౌరారం గ్రామానికి చెందిన చెల్లె వసంత ఎస్సైగా ఉద్యోగం సాధించి కుటుంబానికి తోడుగా నిలుస్తుండగా అక్క స్కూల్ అసిస్టెంట్‌కు ఎంపికైంది. మహిళలమని కుంగిపోకుండా పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధించవచ్చని అంటోంది ఈ వసంత..

కష్టాలను అధిగమించి..

» ఆదర్శంగా నిలుస్తున్న గజ్జె లక్ష్మమ్మ



ఆమనగల్లు, మార్చి7(ఆంధ్రజ్యోతి): హమాలి పనిచేసే భర్త అనారోగ్యంతో మృతి చెందగా ఆ మాతృమూర్తి మనోధైర్యంతో ముందుకు సాగింది. ముగ్గురు పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించి ప్రయోజకులను చేసి ఆదర్శంగా నిలుస్తుంది ఆమనగల్లు పట్టణానికి చెందిన గజ్జె లక్ష్మమ్మ. 30 ఏళ్ల క్రితం భర్త చెన్నయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటికే ముగ్గురు పిల్లలు ప్రేమలత, చరమంద రాజు, శ్రీశైలం గౌడ్ ఉన్నారు. ఓ వైపు భర్త మరణం కుంగదీస్తున్నా కుల వృత్తి అయిన కల్లు అమ్మడమే కాక వ్యవసాయ కూలిగా మారింది. ముగ్గురు పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించింది. పీజీ పూర్తి చేసిన పెద్ద కుమారుడు గజ్జె చరమంద రాజు ప్రస్తుతం నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ సీఐగా, చిన్న కుమారుడు శ్రీశైలం గౌడ్ డిగ్రీ పూర్తి చేసి పోలీసుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. డిగ్రీ చేసిన కూతురు ప్రేమలత టైలర్‌గా పని చేస్తుంది. ఆస్తి పాస్తులు లేని ఆ తల్లి పిల్లలకు ఓ సొంత ఇంటిని సైతం నిర్మించింది.

అవకాశాలను అందిపుచ్చుకొని..

శంకర్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): గిరిజన రైతు బిడ్డ కష్టపడి చదివి ఎస్సైగా ఎంపికైంది. ప్రస్తుతం ఆమె శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ప్రొబెషనరీ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తోంది. వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలం జీవన్గికి చెందిన సోని, లక్ష్మణ్‌కు ముగ్గురు కుమారులు విష్ణు, ఆనంద్, అర్జున్, కూతురు మంజుల ఉన్నారు. కూతురు మాధవి చిన్నప్పటి నుంచే చదువులో చురుకు. 2010-11లో మండల టాపర్‌గా నిలిచింది. ఇంటర్, డిగ్రీ తాండూరులో పూర్తి చేసింది. ఇబ్రహీంపట్నం సిద్ధార్థ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా 2016లో కానిస్టేబుల్ నోటిఫికేషన్ వచ్చింది. కష్టపడి చదివి కానిస్టేబుల్‌గా ఎంపికైంది. శంషాబాదులో ఐదేళ్ల పని చేస్తూనే గ్రూప్స్‌కు ప్రిపేర్ అయ్యింది. 2022లో ఎస్సై నోటిఫికేషన్ రావడంతో ఎస్సైగా ఎంపికైంది. ప్రస్తుతం శంకర్‌పల్లిలో ప్రొబెషనరీ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్నది. తన తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా ఆడపిల్లకు చదువెందుకనే ప్రస్తావనను ఇంట్లో ఎప్పుడూ రానీయలేదని మంజుల చెబుతుంది. ఆడపిల్ల ఆకాశమే హద్దుగా అవకాశాలను అందిపుచ్చుకొని ఎదగాలని సూచిస్తుంది.



ఎస్సై మంజుల

సమాజంలో మహిళల పాత్ర కీలకం

» మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఇబ్రహీంపట్నం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళల పాత్ర కీలకమని, పిల్లల ఆలనాపాలనా చూస్తూనే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని రాచకొండ కమిషనరేట్ మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని గురునానక్ విద్యా సంస్థలు, యూనివర్సిటీలో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'మహిళా సాధికారత - సమాజంలో వారి పాత్ర' అనే అంశంపై డీసీపీ మాట్లాడారు. అపరిచితులతో వ్యక్తులతో ఛాటింగ్ చేయొద్దని, ఎంచుకున్న లక్ష్యం కోసం కృషి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మూఢ విశ్వాసాలతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, వారిలో చైతన్యం రావాలన్నారు. మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గురునాక్ యూనివర్సిటీ ఎండీ డా.సైనీ, డా.నాగరాజకుమారి, డా.షీతల్ కుంద్రా, డా.గీతా త్రిపాఠి, డా.రేణుక, ప్రొఫెసర్ విజయలక్ష్మి, డా.శ్రీనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





చౌదరిగూడలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలి

» సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య

చౌదరిగూడ,మార్చి 7(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్ధుల జంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ, బీకేఎంయూ నాయకులతో కలిసి జిల్లేడ్ చౌదరిగూడ డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని ఏనేగుండు శివారులోని సర్వే నంబర్ 142/2లో 20 గుంటల భూమిని అప్పటి ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం లేఅవుట్ చేసి పట్టాలు తయారు చేసి పంపిణీ చేయలేక పోయిందన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో చాలా మందికి ఇళ్లు లేక, జాగలు లేక కిరాయి ఇళ్లలో ఉంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో కేటాయించిన ప్లాట్లలో అర్హులైన పేదలకు పట్టాలు అందజేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్, కృష్ణ, చిన్నయ్య, షబ్బీర్, లక్ష్మమ్మ లింగం పాల్గొన్నారు.



శంకర్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్

కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ చైర్మన్‌గా శంకర్

కడ్తాల్, మార్చి7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ కల్వకుర్తి నియోజకవర్గ చైర్మన్‌గా కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ పోతుగంటి శంకర్ నియమితులయ్యారు. శుక్రవారం రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నగరిగారి ప్రీతమ్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంటయ్య, శంకర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. కాంగ్రెస్‌కు అందించిన సేవలకు గుర్తింపుగా శంకర్‌కు నియోజకవర్గ స్థాయిలో పదవి లభించింది. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శంకర్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, జగన్, నర్సింహ, శ్రీను, సురేశ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ ఎస్సీ సెల్ కడ్తాల మండల అధ్యక్షుడిగా పోతుగంటి అశోక్ రెండోసారి నియమితులయ్యారు. ప్రీతమ్, కసిరెడ్డి, పెంటయ్య ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు.

హెచ్ఐవీ అంటువ్యాధి కాదు

చేవెళ్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని టీజీ ఎస్ఎసీఎస్ సీపీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, వైఆర్‌జీ కేఆర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్స్ స్కీమ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో శుక్రవారం చేవెళ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యవతీయువకులు పెళ్లికి ముందు ఎవరితోనూ వివాహేతర సంబంధాలు పెట్టుకోవద్దని సూచించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అవగాహనతో తెలుసుకోవాలని సూచించారు. అక్రమ సంబంధాలతో సుఖ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రజలకు గ్రామాల్లో సైతం అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ రామిరెడ్డి, అధికారులు ప్రతాప్‌రెడ్డి, లింగస్వామి, రాములు, అనిత, కళాబృందం సభ్యులు ఉన్నారు.

పద్మశాలి మహాసభలను జయప్రదం చేయాలి

వికారాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహాసభలు మార్చి 9వ తేదీ ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు ఉట్ల నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలకు వికారాబాద్ జిల్లాలోని ప్రతి మండలం, గ్రామం, పట్టణం నుంచి పద్మశాలి సమాజం పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ముందు 'లక్ష్మీదేవునిపల్లి'ని నిర్మించండి

» బీఆర్ఎస్‌పై అభాండాలు సరికాదు

» మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

షాద్‌నగర్ అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణంపై కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై చేస్తున్న అభాండాలు మానుకుని ముందు లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ హితవు పలికారు. షాద్‌నగర్ బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యను తీర్చాలన్న ఉద్దేశంతోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం డిజైన్‌ను మార్చినట్లు తెలిపారు. చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి వద్ద సాగునీటి రిజర్వాయర్ నిర్మించాలన్న ఆలోచన చేశారన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి వరద నీటిని ఎత్తిపోసేలా రూపొందించిన పథకాల్లో ఐదు రిజర్వాయర్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఆరో రిజర్వాయర్ అయిన లక్ష్మీదేవిపల్లి నిర్మాణం కోసం సర్వే చేయించి, రూ.5,646 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. నార్లపూర్, ఏదుల, వట్టెం, కరివేన, ఉదండాపూర్ రిజర్వయర్లు పూర్తి కాగానే లక్ష్మీదేవిపల్లి పనులు ప్రారంభించాలని నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని 80శాతం వ్యవసాయ భూములకు ఉద్దండాపూర్ రిజర్వాయర్ నుంచే సాగునీరు అందేలా కాల్వల డిజైన్‌ను రూపొందించామని, మిగిలిన ప్రాంతాలకు 2.8 టీఎంసీ సామర్థ్యంతో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించడానికి డిజైన్ రూపొందించామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలోనే డిజైన్‌తోపాటు సర్వే పూర్తయిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్మీదేవునిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించి, చూపాలే తప్ప బీఆర్ఎస్‌ను దూషిస్తూ, ఆరోపణలు చేయడం సరికాదన్నారు. షాద్‌నగర్‌కు తాను మంజూరు చేయించిన పాలిటెక్నిక్ కళాశాలను సైతం తామే తీసుకువచ్చినట్టు కాంగ్రెస్ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ వేయించిన రోడ్లు, నిర్మించిన భవనాల్లో ఉంటూ బీఆర్ఎస్‌ను తిట్టడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు క్షమించన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నారాయణరెడ్డి, రాజావరప్రసాద్, ఈట గణేష్, కొందూటి నరేందర్, ఎంఎస్ నటరాజ్, అశోక్, మన్నే నారాయణ, ఎమ్మె సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, విఠల్, లక్ష్మీనారాయణ, కానుగు అంతయ్య, బీష్వ రామకృష్ణ, లక్ష్మణ్‌నాయక్, జూపల్లి శంకర్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజారోహణం

ఆమనగల్లు, మార్చి7(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని వేంకటేశ్వర ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకుడు, నిర్వాహకుడు గూడ కృష్ణమాచార్య ఆధ్వర్యంలో నిత్యారాధన, మహాభిషేకం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహనం, బలిహరణం, ఎదుర్కోళ్లు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంలో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు స్వామి వారి కల్యాణంలో నేపథ్యంలో ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాటు చేశారు.





ఆర్ కృష్ణయ్యతో బీసీ సంఘం ప్రతినిధులు రాజ్‌కుమార్, మధులత, అనిత

తాండూరు నుంచే బీసీ ఉద్యమం

» జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

తాండూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): యాభై ఏళ్ల క్రితం బీసీ ఉద్యమాన్ని తాండూరు నుంచే ప్రారంభించామని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. శుక్రవారం జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మధులత శ్రీనివాస్‌చారి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు ఢిల్లీ స్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలోట్ల తాండూరు నుంచి పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. బీసీ హక్కుల కోసం నిరంతరం పోరాడుతునే విద్యార్థి, నిరుద్యోగ సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. తాండూరు ప్రాంతంలో బీసీ జనాభా ఎక్కువ ఉందని, రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా బీసీలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకుర్, తాండూరు డివిజన్ అధ్యక్షురాలు అనిత, ఉపాధ్యక్షురాలు మంజుల, నర్సమ్మ, కార్యదర్శి జగదీశ్వరి, యాలాల మండల అధ్యక్షుడు లక్ష్మణ చారి, నాయకులు శ్రీనివాస్, అరుణ్, విజయ్, రాములు, ఫయాజ్ ఉన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

గడువులోపు బియ్యం అందించాలి

» అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ బియ్యాన్ని త్వరితగతిన డెలివరీ చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ మిల్లర్లకు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం పరిగిలోని ఇండియా రైస్‌మిల్లు, శ్రీశివ కృష్ణ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. 2024-25కు సంబంధించి ఇప్పటివరకు డెలివరీలో జాప్యం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నెల చివరినాటికి ఇచ్చిన లక్ష్యం మేరకు బియ్యం డెలివరీ చేయాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సివిల్ సప్లయి డీఎం మోహన్‌బాబు, డీఎస్ఎమ్మెఎస్ వెంకటేశ్వర్లు, సంతోష్, విజయ్ ఉన్నారు.

సంతలో అల్పాహారం అందించడం సంతోషకరం

బంట్వారం మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మేకల సంతలో అల్పాహారం అందించడం సంతోషకరమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న మేకల సంతలో ప్రతీవారం ఒకరు ముందుకు వచ్చి అల్పాహారం అందించడంతో రైతులకు, వ్యాపారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జన్రల్ సెక్రెటరీ గాడిల మోహన్‌రెడ్డి శుక్రవారం అల్పాహారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్, డైరెక్టర్లు యాదగిరి, నర్సింహులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ గాడిల మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు.

15 నిమిషాల్లో వస్తున్నానని..
అనంతలోకాలకు

రోడ్డు ప్రమాదంలో మాజీ కార్పొరేటర్ కుమారుడు తీగల కనిష్క్‌రెడ్డి మృతి



చాదర్‌ఘాట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఫంక్షన్‌కు వెళ్లిన కుమారుడు మరో 15 నిమిషాల్లో నీ ముందు ఉంటానంటూ చెప్పిన కుమారుడు అనంతలోకానికి వెళ్లాడంటూ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి చేసిన రోదనలు కంట తడి పెట్టించాయి. రోడ్డు ప్రమాదంలో నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి అన్న సుభాష్‌రెడ్డి మనువడు(ముసారాంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి కుమారుడు) తీగల కనిష్క్‌రెడ్డి తీవ్రంగా గాయపడి మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గురువారం రాత్రి జూబ్లీహిల్స్‌లో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి తుక్కుగూడలోని నివాసానికి వెళ్తున్నాడు. నగర శివారులోని ఓఆర్ఆర్ గేట్ 14 వద్ద బెంజ్ కారు నడుపుతూ ముందున్న లారీని వెనుక వైపు నుంచి ఢీ కొట్టడంతో కనిష్క్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు ఉస్మానియా ఆసుపత్రికి, అక్కడి నుంచి మలక్‌పేట యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అనంతరం మృతదేహానికి ఉస్మానియా ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించిన పోలీసులు బంధువులకు అప్పగించారు. కనిష్క్‌రెడ్డి పార్థీవ దేహాన్ని మలక్‌పేట సలీంనగర్ కాలనీలోని నివాసానికి తీసుకెళ్లారు. గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిన్నారం విఠల్‌రెడ్డి, సామ ప్రభాకర్ రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి జిట్టా రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనిత దయాకర్‌రెడ్డి తోపాటు పలువురు నివాళ్లర్పించారు. మృతుడు కనిష్క్‌రెడ్డి టెక్ మహేంద్రలో బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి

రంగారెడ్డి అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలంటే ముఖ్యంగా కృషి, పట్టుదలతో ఉన్నత విద్యనభ్యసించాలని, ప్రతీ ఆడ పిల్ల తల్లి దండ్రులు, వారి సంరక్షకుల ప్రోత్సాహం ఎంతో అవసరమని మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ముందుగా రాచకొండ కమిషనరేట్ పరిధి లోని మహేశ్వరం డివిజన్ మహిళలందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, విద్య, ఉద్యోగ పరంగా ఎదగాలన్నారు. మహిళలంటే వంటింటికే పరిమితం అనే ధోరణిని విడనాడాలని, ప్రతీఒక్కరు వారిని గౌరవించాలన్నారు.

ఇబ్రహీంపట్నం : ఆరోగ్యంపట్ల మహిళలు శ్రద్ధ తీసుకుంటూనే ఆత్మస్థైర్యంతో ముందుకు పోవాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక అన్నారు. కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. హస్తినాపురం నీలాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. డా.మినర్వా ఆధ్వర్యంలో మహిళా విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. అహల్యాబాయి హోల్కర్ త్రిశతాబ్ది జయంతి సందర్భంగా ఆమె తెగువ, పరిపాలనా దక్షత, సంస్కృతి పరిరక్షణకు ఆమె చేసిన కృషిని అధ్యాపకుడు సురేష్ వివరించారు. సమన్వయకర్తగా మహిళా సాధికారత కన్వీనర్ డా.పి.సురేఖ వ్యవహరించగా ఎన్ఎస్ఎస్ ప్రో గ్రాం అధికారులు డా.ఎ.రచన, డా.రాకేష్ భవాని, వైస్ ప్రిన్సిపాల్ డా.సురేష్, పాల్గొన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

మహిళా దినోత్సవం పురస్కరించుకొని పీఆర్టీయూ మండలాధ్యక్షుడు వర్కాల పరమేష్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలంలో పనిచేస్తున్న మహిళా టీచర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. పంచాయతీ రాజ్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం ఇంద్రసేనారెడ్డి తన తల్లి కళావతి పేరున జ్ఞాపికలు అందజేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్, మండల కార్యదర్శి చంద్రశేఖర్, హెచ్ఎం లావణ్య తదితరులున్నారు.



ఇబ్రహీంపట్నం : మహిళా టీచర్లను సన్మానించిన పీఆర్టీయూ నాయకులు



ఆమనగల్లు : మహిళలను సన్మానిస్తున్న శ్వేతరాము దంపతులు

ఆమనగల్లు : మహిళలు సంఘటితగా ముందుకు సాగాలని, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని ప్రముఖ సంఘసేవకుడు పాపిశెట్టి రాము కోరారు. ఆమనగల్లు పట్టణంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, కార్మికులను పాపిశెట్టి శ్వేత రాము దంపతులు సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కేక్‌కట్ చేసి ప్రజలకు పంచి పెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రణీత, అంజుమ్, హర్షియ, సుజాత, సంధ్య, అర్చన, అనూష, వేణు, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి అర్బన్ : నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుంధతి అన్నారు. శంషాబాద్ మండలం చిన్నగోల్కొండ స్కూల్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళ టీచర్లను శాలువలతో సన్మానించారు. సుగుణదేవి, ఆరోగ్యమేరీ, గోవర్ధన్‌రెడ్డి, శ్యాంసుందర్, భాస్కర్, రెహమాన్, మల్లయ్య, భాగ్యమ్మ, లీలా, అశోక్, క్రాంతి సాగర్, గణేష్, శ్రీరాములు, జయ మ్మ, రాజ బాబు తదితరులున్నారు.

రంగారెడ్డి అర్బన్ : మహిళలు పాడిపశువుల పెంపకంపై దృష్టిపెట్టి అధిక లాభాలు పొందాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రేవతి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని విర్‌బాక్ కంపెనీ ఆధ్వర్యంలో కందుకూరు మండలం చిప్పలపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళలు డ్వాక్రా సంఘాలుగా ఏర్పడి ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చినట్లు గుర్తుచేశారు. కంపెనీ మేనేజర్ అనిల్‌కుమార్, వెంకటేశ్, పశువైద్యాధికారి సాజిత్, చిప్పలపల్లి గ్రామ డ్వాక్రా ప్రతినిధులు పాల్గొన్నారు.

షాబాద్ : మహిళా చైతన్యంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో అపర్ణ, వెల్‌స్పన్ ఫౌండేషన్ ఫ్లోరింగ్ హెచ్ఆర్ హెడ్ సుధీర్‌కుమార్ అన్నారు. హైతాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరుపుకున్నారు. వారు మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఎంఈవో లక్ష్మణ్, హెచ్ఎం వసంత, వెల్‌స్పన్ ఫౌండేషన్ ప్రతినిధి సురేఖ, భద్రయ్య, పాల్గొన్నారు.



రంగారెడ్డి అర్బన్ : మహిళా టీచర్లకు సన్మానం

మైసమ్మ ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు

కడ్తాల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయం ఆవరణలో భక్తుల సౌకర్యార్థం నేలతల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు బాలాజీ సింగ్, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలతో కలిసి శుక్రవారం చలివేంద్రాన్ని ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించారు. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీక్యానాయక్, నాయకులు శేఖర్‌గౌడ్, జవహర్‌లాల్ నాయక్, లక్‌పతినాయక్, హీరాసింగ్, రామావత్ బాస్కర్, బీక్యానాయక్, హన్మనాయక్, నరేశ్ నాయక్, జహంగీర్‌అలీ, యాదగిరి రెడ్డి, శంకర్, నేలతల్లి ఫౌండేషన్ సభ్యులు చంటి, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను వినియోగించుకోవాలి

● చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల/షాబాద్/రంగారెడ్డి అర్బన్/శంకర్‌పల్లి/మొయినాబాద్ రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శుక్రవారం చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన రూ.16,01,856 చెక్కులను అందించారు. తహసీల్దార్ కృష్ణయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, మాజీ సర్పంచ్‌లు బండారు శైలజాఆగిరెడ్డి, నాయకులు రాములు, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు. షాబాద్ మండలం హైతాబాద్‌లో రూ. 5లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు పనులను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అలాగే ఎమ్మెల్యే మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. షాబాద్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 42 మంది లబ్దిదారులకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డితో కలిసి చెక్కులను పంపిణీ చేశారు.



షాబాద్ : హైతాబాద్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సర్దార్‌నగర్ ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, చేవెళ్ల ఏఎంసీ చైర్మన్ పెంటయ్యగౌడ్, తహసీల్దార్ అన్వర్, డిప్యూటీ తహసీల్దార్ మధు, మాజీ సర్పంచులు జనార్దన్ రెడ్డి, ఖాజామియాపటేల్, రవీందర్‌నాయక్, నర్సింహులు, జంగయ్య, మాజీ ఎంపీటీసీలు తమ్మలి రవీందర్, అశోక్, నాయకులు సుభాష్‌రెడ్డి, రఫీక్, రాఘవేందర్, శ్రీనివాస్ రెడ్డి, బురాన్, శ్రీరాములు, దస్తగిరి, చంద్రారెడ్డి, శేఖర్, రామస్వామి, జానీ, గౌరీశ్వర్ తదితరులు పాల్గొన్నారు. శంకర్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎమ్మెల్యే కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, తహసీల్దార్ సురేందర్, మాజీ జడ్పీటీసీ గోవిందమ్మ, యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు షైపాల్, మండలాధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, నాయకులు గోపాల్, వెంకట్‌రెడ్డి, సురేందర్, కిష్టయ్య, రాజుగౌడ్, నరేందర్ రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు. ఇటీవల నూతనంగా ఏర్పడిన మొయినాబాద్ మున్సిపల్ కార్యాలయం అజీజ్‌నగర్‌లో ఏర్పాటుచేసిన వివిధ శాఖలకు సంబంధించిన విభాగాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజామొయిజుద్దీన్, మేనేజర్ జమీల్, తదితరులున్నారు. మోత్కుపల్లిలో సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఫిరంగి భాస్కర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

కూలీల అనాసక్తి!

(3వ పేజీ తరువాయి)

ఉన్నతాధికారులు పనిచేస్తున్నా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఉపాధి పనులు సాగుతున్న తీరుపై ప్రతీరోజు జిల్లా డీఆర్‌డీవో శ్రీలత, ఎంపీడీవో, ఏపీవో, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లతో టెలీకాన్ఫరెన్స్ తీసుకుంటున్నారు. పలుచోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు ఇటు పంచాయతీ పనులు, అటు ఉపాధి పనులు చేయించలేకపోతున్నారు. జిల్లాలో 150 ఫీల్డ్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫీల్డ్‌అసిస్టెంట్లు లేనిచోట పంచాయతీ కార్యదర్శులు సీనియర్ మేట్‌లకు పనులు అప్పగించడంతో వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీంతో అధికారులు ఆశించినట్లుగా కూలీలకు ఉపాధి పనులు కల్పించలేకపోతున్నట్లు తెలుస్తోంది. పట్టాభూములున్న రైతులు తమ పంట పొలాల్లో స్టోరేజ్‌ఫండ్, క్యాటిల్‌షెడ్, ఇంకుడుగుంతల నిర్మాణం, రూఫ్ టాప్ పనులు చేయించుకోవడానికి ఆసక్తి చూపడం లేదని అధికారులు చెబుతున్నారు.

కూలీల హాజరు తీరు ఇలా..

జిల్లాలో 21 మండలాల్లోని 558 గ్రామపంచాయతీలలో ఇప్పటికే రోజుకు 25నుంచి 30 వేల మంది కూలీలు పనులు చేయాల్సి ఉంది. కాగా శుక్రవారం 12453మంది, గురువారం 11796 మంది మాత్రమే హాజరయ్యారు. శుక్రవారం కందుకూరు మండలంలో 1231, మాడ్గులలో 1223, యాచారంలో 1124 మంది కూలీలు పనులు చేయగా... మొయినాబాద్‌లో 20, కొత్తూర్‌లో 26, నందిగామలో 49, మహేశ్వరంలో 69,అబ్దుల్లాపూర్‌మెట్‌లో 91, శంషాబాద్‌లో 45మంది కూలీలు, మహేశ్వరంలో 67, కందుకూరులో 1236, యాచారంలో 1107,మాడ్గులలో 1253, తలకొండపల్లిలో 1130, చేవెళ్లలో 258, ఫరూక్‌నగర్‌లో 789 మంది కూలీలు పని చేసినట్లు అధికారులు తెలిపారు.

డబ్బు చెల్లింపులో జాప్యం

ఉపాధి పనులు నత్తనడకన సాగడానికి అనేక కారణాలున్నాయి. కూలీలు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ప్రతీ వారం డబ్బు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మూడు వారాల బిల్లు రాలేదని కూలీలు పేర్కొంటున్నారు. దీనికి తోడు ఉపాధి పథకంలో అవకతవకలు నివారించేందుకు ప్రభుత్వం కొత్తగా హాజరు విధానం తీసుకురావడంతో సమస్యలు ఎదురవుతున్నాయి. కూలి అధికంగా వస్తుందని ఎక్కువమంది వ్యవసాయ పనులకు వెళ్తున్నారు. మెటీరియల్ బిల్లులు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెప్పారు. ఈ కారణంగానే రైతులు పశువుల దొడ్లు, కోళ్లఫాం, వర్మీ కంపోస్ట్ తయారీ షెడ్లు తదితర పనులు చేయించుకోవడానికి ముందుకు రావడం లేదని తెలిసింది. నర్సరీలో పనులు చేస్తున్న కూలీలకు రోజుకు రూ.300 పెంచింది. ఒక్క ఫాంపాండ్ నిర్మిస్తే కూలీలకు రూ.లక్ష వరకు ఆదాయం అందుతుంది.

నీటి సరఫరా సక్రమంగా చేపట్టాలి



వినతి పత్రం ఇస్తున్న దాసర్లపల్లి నాయకులు

కందుకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసర్లపల్లికి కృష్ణానీటి సరఫరా సక్రమంగా కాకపోవడంతో నీటి ఎద్దడి అధికమైందని, వెంటనే చర్యలు చేపట్టి సకాలంలో నీటిని సరఫరా చేయాలని గ్రామానికి చెందిన నాయకులు శుక్రవారం ఎంపీడీవో సరితకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామానికి చెందిన నాయకులు పి.అశోక్, జె.దయాకర్, కృష్ణయ్యలు ఎంపీడీవో సరితకు వినతి పత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు. గ్రామానికి ప్రతీరోజు లక్షా 60వేల లీటర్ల కృష్ణానీటిని సరఫరా చేయాల్సి ఉండగా.. 20రోజుల నుంచి కేవలం 50వేల లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడి వస్తే.. వేసవిలో సమస్య ఎలా ఉంటుందోనని గ్రామస్తులు ఆవేదనకు గురౌతున్నట్లు తెలిపారు. ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఎంపీడీవో సరితకు వినతపత్రం ఇవ్వగా వెంటనే పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌చేసి నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దేవుని పడకల్‌లో 20న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు

తలకొండపల్లి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దేవుని పడకల్ గ్రామంలో ఈనెల 20న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డిలు తెలిపారు. గ్రామంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే పోటీలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం పోటీల సన్నాహక సమావేశం నిర్వహించారు. కాగా, రైతు సంబురాలు పేరిట బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ కాడేమోని శ్రీశైలం తెలిపారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి సీనియర్ నాయకుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌కు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ మార్కెట్ డైరెక్టర్ లాయక్‌అలీ కోరారు. శుక్రవారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు లేఖలు పంపారు. బీసీ సామాజిక వర్గంలో రాష్ట్రంలో బలమైన నాయకుడిగా పేరుండి, మూడు సార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన జైపాల్ యాదవ్‌కు అవకాశమిస్తే ప్రజా సమస్యలపై మండలిలో ప్రజా గొంతుకగా నిలుస్తారన్నారు.

కేశంపేట : విద్యార్థులకు వారి తల్లితండ్రులు, ఉపాధ్యాయులే మార్గదర్శకులని కేశంపేట మాజీ జడ్పీటీసీ విశాల శ్రవణ్‌రెడ్డి అన్నారు. ఇప్పలపల్లిలో గల వీఐపీ పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం వెంకటకృష్ణ టీచర్లు ఉన్నారు.

తలకొండపల్లి : పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డిలు మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ల రమేశ్ తల్లి లచ్చమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతురాలు కుటుంబానికి ప్రభాకర్ రెడ్డి రూ. 5 వేలు, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కాసు శ్రీనివాస్ రెడ్డి రూ. 4వేలు, యాట నర్సింహ రూ.3 వేలు, కాంగ్రెస్ మండల నాయకులు రూ.6 వేలు అందజేశారు.

తలకొండపల్లి : మల్లప్పగుట్ట మల్లిఖార్జున స్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ ఏడాది రూ.6.04 లక్షల ఆదాయం లభించింది. కల్లు పెంటారెడ్డి, మాకం పాండయ్య, మల్లారెడ్డి, తదితరులున్నారు.

కడ్తాల్ : రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న కడ్తాల మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన క్యామ శివను శుక్రవారం డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గూర్చి అడిగి తెలుసుకున్నారు. చికిత్స నిమిత్తం రూ. 5 వేలు ఆర్థికసాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు పిప్పళ్ల యాదయ్య, బోసురవి, క్యామ రాజేశ్, భానుకిరణ్, శ్రీకాంత్, మహేందర్, తదితరులున్నారు.

కేశంపేట : ఎక్లాస్‌ఖాన్‌పేటలోని ఆర్‌వి కాన్సెప్ట్ పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. హెచ్ఎం రవీందర్, ఉపాధ్యాయులు కె.సబితా, ఆర్.శ్రావణి, అఖిల ఉన్నారు.

రంగారెడ్డి అర్బన్ : సమకాలీన సమాజంలో లోకమాతాదేవి అహల్యాబాయి జీవితం ఎంతో ఆదర్శనీయమని మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ అన్నారు. అహల్యాబాయి హోల్కర్ జయంతి నిర్వహించారు. వైస్‌ప్రిన్సిపాల్ చందన, టీచర్లు ఉన్నారు.

కేశంపేట : హోలీ వేళ రోడ్లపై డబ్బు వసూళ్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేశంపేట సీఐ నరహరి హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హోలీకి ముందు కేశంపేట-షాద్‌నగర్, కేశంపేట-ఆమనగల్లు, కొత్తపేట - షాద్‌నగర్ రోడ్లపై వాహనాలు ఆపి డబ్బులు వసూలు చేస్తున్నరన్న సమాచారం ఉందని తెలిపారు.

ఉరేసుకొని మహిళ మృతి

ఆదిభట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కారణంగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మహిళ మృతిచెందిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజు కథనం మేరకు.. భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మండలం, రత్నానగర్ కాలనీ చెందిన శ్రీకాంత్‌రెడ్డిసుష్మా దంపతులు తుర్కయంజాల్, రాగన్నగూడలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ప్రైవేటు ఉద్యోగానికి వెళ్లగా పిల్లలు స్కూల్‌కు వెళ్లారు. సుష్మా ఇంట్లోనే ఉంది. సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చి తల్లిని పిలువగా.. తలుపులు తీయలేదు. దాంతో ఇంటిపక్కన ఉన్న వ్యక్తి వచ్చి రాయితో తాళం పగులగొట్టి చూడగా సుష్మా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. స్థానికులు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ డ్యూటీ డాక్టర్ పరిశీలించి సుష్మా మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

మహనీయుల ఉత్సవాలను జయప్రదం చేద్దాం

రంగారెడ్డి అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఏప్రిల్‌లో నిర్వహించే మహనీయుల ఉత్సవాలను విజయవంతం చేయాలని తంగెళ్లపల్లి మాజీ సర్పంచ్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను, ఆలోచనలను ప్రజలకు తెలియజేయాలన్నారు. జాతర ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పార్టీలకు, కులాలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రామగళ్ల సుందర్, దుర్గని శ్రీను, యాదయ్య, ప్రసాద్, నరేందర్, అమృతయ్య, వాసురీ, ప్రవీణ్, లక్ష్మణ్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

రంగారెడ్డి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని, శాంతిభద్రతలకు చెక్ పెట్టవచ్చని నందిగామ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. నందిగామ మండల కేంద్రంలోని శివరామాంజనేయ స్వామి దేవాలయంలో మండల కేంద్రానికి చెందిన కేశమోని శ్రీనివాస్‌యాదవ్ సహకారంతో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను శుక్రవారం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పరిశీలించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు కేశమోని శ్రీనివాస్ యాదవ్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి, బాలు, నర్సింగ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు ప్రారంభం

రంగారెడ్డి అర్బన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్దఎల్కిచర్లలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద సీసీరోడ్డు రూ.19 లక్షలు, అండర్ డ్రైనేజీ రూ.4లక్షలతో చేపట్టనున్న నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ప్రారంభించారు. ఆంజనేయులు, సలీం, వెంకటనర్సింహారెడ్డి, యాదయ్య, శ్రీనివాస్, రజిత, నర్సింహులు, యాదగిరి, నందు తదతరులు పాల్గొన్నారు.

విధిగా వేతనాలు చెల్లించాలి

యాచారం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు నెలనెలా క్రమం తప్పకుండా వేతనాలందించి ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ మండల కార్యదర్శి చందూనాయక్ ఎంపీవో శ్రీలతకు వినతిపత్రం అందించారు. జీవో 51ను సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని కోరారు. కార్మికులకు వేతనాలందించడానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి గ్రీన్‌చానల్ ద్వారా అందించాలన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పంచాయతీ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని, అనారోగ్యానికి గురైన వారికి వైద్యమందించాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని చెప్పారు. సీఐటీయూ నాయకులు నరేందర్, బుగ్గరాములు తదితరులున్నారు.

ఎండలో పనులు మంచిది కాదు

యాచారం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఎండలు బాగా ఉన్నాయని, పని చేసి రోగాలబారిన పడరాదని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి ఉపాధిహామీ కూలీలను కోరారు. శుక్రవారం మండలంలోని చౌదర్‌పల్లిలో ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. మెడికల్ కిట్లతో పాటు తాగునీటి వసతి కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్యను ఆదేశించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

షాద్‌నగర్ రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చించోడు రోడ్డులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాంసాన్‌పల్లికి చెందిన చిందకింది నర్సింహ(33) గురువారం ఉదయం భార్య సుమలతతో కలిసి మోటార్ సైకిల్‌పై బ్యాంక్ పనిమీద షాద్‌నగర్ వచ్చారు. పని ముగించుకున్న తర్వాత సాయంత్రం 4 గంటల సమయంలో తనకు పని ఉందని భార్యను గ్రామానికి పంపించాడు. రాత్రి 8గంటల సమయంలో పీర్లగూడ స్టేజీ సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు కిందికి వెళ్లిపోయింది. కింద పడిన అతడికి తీవ్రంగా దెబ్బలు తగలడంతో అక్కడే మృతిచెందాడు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం బాటసారులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఆదిభట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఔటర్‌రింగ్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా, బెక్కం గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి(45) తన స్నేహితుడితో కలిసి గురువారం ఉప్పల్‌లో ఓ శుభకార్యానికి హాజరై ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ నుంచి తుక్కుగూడ వైపు బ్రీజా కారులో వస్తుండగా రావిర్యాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 వద్ద హెచ్ఎండీఏ వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో తన స్నేహితుడు కోశిక రవీందర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలైన కృష్ణారెడ్డిని హైదరాబాద్‌లోని అరుణ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆరోగ్యం పరిస్థితి విషమించడంతో మలక్‌పేటలోని యశోద హాస్పటల్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

ఏటీఎం కార్డు కాజేసి.. రూ.40 వేలు డ్రా చేసిన కేటుగాడు

యాచారం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డు జనరేట్ చేస్తానని ఓ మహిళను నమ్మించి ఆపై మహిళకు తన కార్డు ఇచ్చి ఆమె కార్డుతో రూ.40వేలు డ్రా చేసిన ప్రబుద్ధుడి ఉదంతం గురువారం సాయంత్రం వెలుగుచూసింది. యాచారం పోలీసుల కథనం మేరకు.. యాచారం మండల కేంద్రానికి చెందిన అరుణ యాచారంలోని ఏటీఎంలో డబ్బు డ్రా చేసుకోవడానికి వెళ్లింది. ఈక్రమంలో ఏటీఎం కార్డును ఏటీఎంలో పెట్టి డబ్బు తీసుకునేందుకు యత్నించడం చూసిన రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఆమెతో మాటలు కలిపాడు. తాను డబ్బులు డ్రా చేస్తానని చెప్పగానే అరుణ ఏటీఎం కార్డు అతనికిచ్చింది. ఈక్రమంలో రాజ్‌కుమార్ కార్డు జనరేట్ చేస్తున్నట్లు నటించి డబ్బు డ్రా కావడం లేదని ఆమెను నమ్మించాడు. తన ఏటీఎం కార్డు అరుణకిచ్చి ఆమె కార్డును తీసుకున్నాడు. అనంతరం ఇబ్రహీంపట్నంలోని ఏటీఎంలో అరుణ కార్డుతో రూ.40వేలు డ్రా చేశాడు. దాంతో మోసపోయానని తెలుసుకున్న అరుణ తనకు జరిగిన అన్యాయంపై గురువారం సాయంత్రం యాచారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

యువకుడి అదృశ్యం



జస్వంత్‌సింగ్

చేవెళ్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఫైవుడ్ షాప్‌లో పనిచేస్తున్న యువకుడు అదృశ్యమైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్ రెడ్డి కథనం మేరకు.. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో రాందేవ్ ఫైవుడ్ షాప్ యజమాని హీర్ సింగ్మా వద్ద మూ డు నెలల నుంచి జస్వంత్‌సింగ్ అనే యువకుడు పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈనెల 6వ తేదిన పనికి వచ్చి తి రిగి సాయంత్రం 4 గంటలకు తాను ఉంటున్న గదికి వెళ్లాడు. ఈక్రమంలో హీర్ సింగ్మా జస్వంత్‌సింగ్ ఉంటున్న రూమ్‌కు వెళ్లిచూడగా క న్పించ లేదు. వెంటనే అతడికి కాల్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించకపోవడంతో హీర్ సింగ్మా శుక్రవా రం సాయంత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్ధరాత్రి డీజే నిర్వహణ.. ముగ్గురికి జరిమానా

చేవెళ్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పోలీస్‌ల అనుమతి లేకుండా అర్ధ రాత్రి డీజే నిర్వహించడంతో పాటు ప్రజలకు ఇబ్బంది కలిగించిన ముగ్గురు వ్యక్తులకు చేవెళ్ల జూనియర్ సివిల్ ఇన్‌చార్జి జడ్జి ధీరజ్‌కుమార్ రూ.18వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. పూర్తి వివరాలు చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మీడియాకు తెలిపారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో ఈనెల 4న పుట్టిన రోజుల వేడుకల్లో భాగంగా అర్ధరాత్రి 2గంటల సమయంలో అనుమతి లేకుండా డీజే నిర్వహించి ప్రజలకు ఇబ్బంది కలిగించిన నిర్వాహకుడు నాయక్ తోపాటు డీజే సౌండ్ ఆపరేటర్ హరీశ్వర్, డీజే ఓనర్ శివ తదితరులపై చేవెళ్ల పోలీస్‌లు కేసు నమోదు చేసి చేవెళ్ల మెజిస్ట్రేట్ ముందు ఆ ముగ్గురిని హాజరుపరిచారు. ఇన్‌చార్జి జడ్జి ధీరజ్‌కుమార్ వారికి ఒక్కొక్కరికి రూ.6వేల చొప్పున రూ.18వేల జరిమానా విధించారు. కోర్టు విధించిన జరిమాన కట్టని యెడల 7 రోజుల జైలు శిక్ష విధించబడుతుందని తీర్పు వెల్లడించారు.

గంజాయి తరలింపు కేసులో ముగ్గురి రిమాండ్

శంకర్‌పల్లి, మార్చి7(ఆంధ్రజ్యోతి): గంజాయిని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తులను మోకిల పోలీసులు అరెస్టు చేసి శుక్రవారం రిమాండుకు తరలించారు. 52కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని, కారు, 4 ఫోన్లను సీజ్ చేశారు. మోకిల సీఐ వీరబాబు కథనం మేరకు.. మీర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్ సర్వీసు రోడ్డు మీదుగా నాగ్‌పూర్‌కు అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం మధ్యాహ్నం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇంద్రారెడ్డి నగర్ వద్ద షిఫ్ట్ కారును అడ్డగించి అందులో ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. కారును తనిఖీ చేయగా 52కిలోల గంజాయి పట్టుబడింది. పోలీసులు రమావత్ మాత్రు, నీలేష్ బబన్ కాలె, సేనావత్ తేజలను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. వీరిపై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు.

ఆటోను ఢీకొన్న బైక్.. మహిళ దుర్మరణం

ఆదిభట్ల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): యూటర్న్ తీసుకుంటున్న ఆటోను అతివేగంగా బుల్లెట్ బైక్ ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న మహిళ మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం మేరకు.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, తుర్కయంజాల్ మున్సిపాలిటీ సుందరయ్య కాలనీకి చెందిన కవిత(49), రాములమ్మ(49), కె.ఉమలు మన్నెగూడలోని జేయంఆర్ ఫంక్షన్ హాల్‌లో శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి రాత్రి 12.30గంటలకు ఆటోలో ఇంటికి(సుందరయ్య కాలనీ) బయలుదేరారు. ఈక్రమంలో యంజాల్ మాసాబ్ చెరువు కట్టపైన ఉన్న బుద్ధుడి విగ్రహం వద్ద ఆటో యూటర్న్ తీసుకుంటుండగా హైదరాబాద్ నుంచి యంజాల్ వైపుకు వస్తున్న నంబర్ ప్లేట్ లేని బుల్లెట్ బైక్ ఆటోను ఢీకొట్టింది. ఆటో డ్రైవర్ డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆటోలో ఉన్న కవిత తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా రాములమ్మ, ఉమకు గాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలపారు.